# ఆ 'అబ్బాయి' కథ

"సారంగపాణి"

రామనాథం తన కూతురికి ఆ 'అబ్బాయి'ని చూస్తున్నాడని విన్న సంగతి నేను నమ్మలేకపోయినాను. ఎందుకంటే ఆ 'అబ్బాయి'కి మా సీనియరు కూతుర్ని యివ్వాలనుకున్నాం, రెండేళ్ళ కిందట. ఆ సందర్భంగా అతని కోరికలన్నీ నాకు తెల్సు. అతనికి ఆ కోరికలుండటంలో అసహజం ఏమీ లేదు. ఎందుకంటె అతని పరిస్థితి అలాంటిది. సుక్షేత్రమయిన యిరవై ఎకరాల మాగాణి వున్నవాడనికి. ఒక్కడే పిల్లవాడు ఎం.ఎ. ప్యాసయినాడు. కాలేజీలో లెక్చరుగా పని చేస్తున్నాడు. చాలా అందంగా వుంటాడు కూడాను

యింక అతని కోరికలు- పిల్ల గ్రాడ్యుయేటు అయి వుండాలి. కట్నం కనీసం యిరవై వేలన్నా తేగలగాలి. పిల్ల చాలా అందంగా- అంటే నేను విన్నది- అవసరంవస్తే సినిమాలో హీరోయినుగా వెంటనే ప్రవేశించేటంత అందంగా వుండాలి. తండ్రికి మంచి స్టేటసు వుండాలి, పిల్లకు తమ్ములుగాని అన్నలుగాని వుండకూడదు. అల్లాంటి కోరికలున్న ఆ 'అబ్బాయి'కి రామనాథం సంబంధం చూస్తున్నడంటె ఎవరికయినా ఆశ్చర్యమే! అనుమానం లేదు.

యింక రామనాథం కూతురు విషయం- నల్లగా వుంటుంది. కొంచెం లావుగా వుంటుంది. మెట్రిక్ పరీక్షతో మూడేళ్ళ బట్టి సతమతమవుతున్నది. రామనాథానికి ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. నాలుగు వేలకన్నా కట్నం యిచ్చుకోలేడు. అది కూడా కొంత ప్రోనోటు వల్లనే. తను చేస్తున్న స్కూలు మేష్టారు వుద్యోగంవల్ల అంతకన్నా ఏం చేయగలడు కనక! వెనక ఆసరా లేనప్పుడు.

యింక ఆ అబ్బాయి పిల్లను చూడటానికి వచ్చేటప్పుడు వేసే ప్రశ్నలు యిన్నీ అన్నీ కావు. బహుశా చాలామంది పిల్లలను చూడటం అలవాటయినందువలన ఎంతో అనుభవంమీద అడిగినట్లుగా అడుగుతాడు. గ్రాడ్యుయేట్ పిల్ల కనక అయితే అంతర్జాతీయ రాజకీయ విషయాల

దాకా వెళ్తాడు. మా సీనియరు కూతుర్ని మొదటి ప్రపంచయుద్ధం ఎట్లా అంతమయిందోనని అడిగాడు. సినిమాలలోని టెక్నికలు విషయాల దగ్గర్నుంచి, పరిశ్రమల జాతీయకరణ దాకా అడుగుతాడని విన్నాను. ఒక అమ్మాయిని సంస్కృతంలోని వ్యాకరణం గురించి అడిగాడట.

ఆ పిల్లవాడు జిల్లాకు ఆరుగురి పిల్లల చొప్పున ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాలను పూర్తిచేశాడని అంటారు యీ విషయం నాకు రామనాథమే చెప్పాడు. అల్లాంటి వాడికి రామనాథం కూతురు పరీక్షలో ఏ విధంగా నిలబడుతుందోనని నాకు అనుమానం వేసింది. రామనాథం ధోరణిబట్టి తనకు యీ సంబంధం తప్పక ఖాయం అవుతోందని నమ్మకంగా వుందని చెప్పాడు.

రామనాథం ఆశను నేను దేనితో పోల్చలేను కాని నాలోటివాడు రాష్ట్రపతి పదవికి పోటీచేయడం ఎల్లాంటిదో యిదీ అల్లాంటిదే!

మా సీనియరు కూతురికి పెళ్ళయింది. యిప్పుడు ఆమెకు మొగపిల్లవాడు కూడాను. రామనాథం చెప్పే విషయం మా సీనియరు కూతురికి చూసిన అబ్బాయి నేనా అనుమానం వచ్చింది. రామనాథం చెప్పిన వివరాలనుబట్టి, ఆ అబ్బాయేనని ధృవపడింది.

"అతని కింకా పెళ్ళి కాలేదా" అన్నాను రామనాథంతో.

"ఎట్లా అవుతుందండీ మా పిల్లను రాసిపెట్టినపుడు" అన్నాడు. నాకో సిగిరెట్టు యిస్తూ.

రామనాథం నాతో ఒకరోజు నకన్పించి "రేపు సోమవారం పిల్లనుచూడటానికి వస్తోట్ట. కాస్త మీరు నాకు సహాయంగా ఆ రోజు వుండాలి" అన్నాడు. నాకనుమానంవేసి "వుత్తరం వచ్చిందా" అన్నాను.

"నేను మొన్ననేగా అతని దగ్గర్నుంచి వచ్చింది" అన్నాను.

ఆ అబ్బాయిని గురించి నేను విన్నదాన్నిబట్టి నా అనుభవం పురస్కరించుకొని, నేను రామనాథం మాటలు నమ్మలేకపోయాను కాని అతను చెప్పేమాటనుబట్టి అతని కెంతో ఆశగా వుంది.

"పోనీ పిల్లఫొటో పంపించకపోయినావా" అన్నాను, మొగట్లోనే యీ విషయం తేలిపోయేదని. ఎందుకంటే రామనాథం కూతుర్ని చూసిన వరులు అక్కడికక్కడే అంటే రైలుకు వెళ్తూ దారిలోనే వేరేఏర్పాటు చేసుకోమని చెప్పేవారట. అవన్నీ నాకు తెల్సు.

"ఎందుకండీ కాలయాపన. శెలవు దొరక్కకాని అతనికి, లేకపోతే యీ పాటికి వచ్చేసేవాడే" అన్నాడు.

నేను అహా సాధించినక రామనాథం కూతుర్ని ఆ అబ్బాయి పెళ్ళిచూపులకు వచ్చి చూసినప్పుడు అతని మనోవ్యధకు నేను తట్టుకోలేనని "నాకు సోమవారం కోర్టుపని వుంది. మా సీనియరు కూడా

వుండడు" అన్నాను తప్పించుకునే నెపంతో.

"మీ కెందుకూ మీ సీనియర్ని ఒప్పిస్తానుగా" అన్నాడు.

రామనాథం అన్నంతపనీ చేశాడు. మా సీనియరు ప్రయాణం మానుకున్నారు. సోమవారంనాడు నాకు యీ శిక్ష తప్పేట్టు లేదు పైగా ఆదివారంనాడు రామనాథమూ అతనిభార్యా వచ్చి నన్ను సోమవారంనాడు పెళ్ళిచూపులప్పుడు వుండాలని బలవంతం చేశారు. పైగా నేను రాకపోతే నాకు యీ పెళ్ళిజరగటం యిష్టంలేదని అనుకోవల్సి వస్తుందని నిష్ఠూరంగా అని పోయినారు.

బురదలో జారకుండా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నట్లుగా గుండె పట్టుకొని ధైర్యం తెచ్చుకుని సోమవారంనాడు వాళ్ళయింటికి వెళ్ళాను. ఆదివారంనాటి రాత్రి నాకు నిద్రపట్టలేదు. సోమవారంనాడు నేను ఎదుర్కొనే వుపద్రవం తల్చుకొని

పిల్లవాడికోసం రామనాథం స్టేషనుకు వెళ్ళలేదు. అతనే వచ్చాడు. యింక అనుమానంలేదు నే ననుకొన్న అబ్బాయే ఆ అబ్బాయి. మనిషిలో ఏమీ మార్పులేదు. వెనకటి అంత చక్కగా వున్నాడు. రామనాథం ఫ్రీగానే వున్నాడు. ఏమీ బెరుకుగాని సంశయంగాని లేవు అతన్లో.

రామనాథం కూతుర్ని ఆ అబ్బాయి మొదటిసారి చూసినప్పుడు నేను ఆ అబ్బాయిని చూడలేననుకొని తలను దించి నేలను చూస్తున్నాను పిల్లవాడు పిల్లను పేరూ, చదువూ ప్రశ్నించాడు

"పెళ్ళి అయితేనేగాని మెట్రిక్కు అయ్యేటట్టులేదు" అన్నాడు రామనాథం. పిల్ల నవ్వింది. పిల్లవాడు నవ్వాడు. పిల్ల ఎత్తుపళ్ళన్నీ బయటపడ్డాయి.

"అంతవరకూ చాల్లెండి. ఏదో ఎడ్రస్సులు రాసుకునేందే చదువుంచేచాల్లెండి ఆడవాళ్ళకు" అన్నాడతను.

నే నెక్కడున్నానో నేను నిల్చున్న భూమి ఏమవుతుందోనని చెమటలు పట్టినయి. యితని మాటలు నమ్మవచ్చా! వెనకటి అతని అభిరుచులకీ యిప్పటికి యింత తేడా ఏమిటి! నా కనుమానం వచ్చింది.

పిల్లవాడి సుముఖత అసరా చేసుకొని మావాడు సంగీతం చెప్పించాలనుకున్నాడు కాని యిక్కడ సరిగా చెప్పేవాళ్ళు లేరని మానుకొన్నాడని అన్నాడు. నన్ను ఈ అబ్బాయి గుర్తుపట్టినట్లులేదు. ఎందుకంటే యీ రెండేళ్ళలో నాలాంటివాళ్ళను ఎంతమందిని చూశాడో!

"ఆడవాళ్ళకు అన్నింట్లో ప్రవేశం వుండటం మంచిదికాదు. యిప్పుడు ఎక్కడపట్టినా సంగీతమే కదండీ నిద్ర పట్టకుండా" అన్నాడు నవ్వుతూ.

తతంగం అంతా అయింది. ఫలహారాలు అయినాయి. "ఏదీ మీరు వెంటనే వెళ్ళగానే తెలియచేస్తే ." అన్నాను రామనాథం వకాల్తా పుచ్చుకొని.

"దీనికి మళ్ళా మిమ్మల్ని సస్పెన్సులో పెట్టటం దేనికి...." అన్నాడు అతను నవ్వుతూ. అతని నిర్ణయం ఎలావుంటుందా అని నాకు జీవన్మరణ సమస్యగా వుంది, రామనాథానికి పరీక్ష రిజల్టు

ముందే తెల్సుకున్నవాడిలాగ సంతోషంగా వున్నాడు.

"మంచిరోజు చూసుకొని ముహూర్తం పెట్టుకుందాం" అన్నాడు.

నేను నమ్మలేకపోయినాను. అసలు యితను ఆ అబ్బాయేనా అని. మళ్ళీ యితన్ని పరీక్షగా చూశాను అనుమానం లేదు. ఆ అబ్బాయే యితను.

"నాకు వచ్చే నెలలో శెలవు దొరకదు" అన్నాడు అతను.

"మరి ఏర్పాట్లకూ కల్యాణానికి కానుక లకూ మా వాడికి వ్యవధి వుండొద్దా" అన్నాను

"అవును మరి" అన్నాడు రామనాధం.

"వాటికేంలెండి. అవి మనం మనం సరిచేసుకోవచ్చు" అన్నాడు రామనాధం.

"అలాగే కానివ్వండి" అన్నాడు పెళ్లివాడు లేస్తూ.

నేను రామనాధాన్ని భయంతోనూ సంశయంతోనూ అభినందించాను. నాకెందుకో యిందులో మోసం వుందని పించింది.

అనుకున్నట్లుగానే వెంటనే ముహూర్తాలు పెట్టుకోటం ఆ నెలలోనే పెళ్ళికావటం జరిగింది. నాకే కాదు, పెళ్ళికివచ్చినవాళ్ళకు కూడా ఆ పిల్లను పిల్లవాన్ని చూసిన వాళ్ళకు యిందులో ఏదో మర్మం వుందని అనుమానం వేసింది.

రామనాధం కూతుర్ని అంతకుముందు చూసినవాళ్ళు రామనాధానికి ఏదో మోసం జరిగిందని అతన్తోతప్ప బాహాటంగానే అన్నారు. లేకపోతే అంత అందమయిన వాడు ఆ అమ్మాయిని వొప్పుకోవటం ఏమిటి!

పెళ్ళయిన పదిరోజులదాకా రామనాధం కూతురి పెళ్ళి ఒక సమస్య అయి కూచుంది నాకు, అత నెట్లా చేసుకున్నాడా ఎందుకు చేసుకున్నాడా అని. ఎన్నో అభిరుచులు కలిగిన, ఎన్నో హిరణ్యాక్షి కోరికలు కోరిన ఆ అబ్బాయి రామనాధం కూతుర్ని ఎందుకు చేసుకొన్నాడు! ఏమిటి యీ వింత! పిల్లను కాపరానికి తీసుకు వెళ్తాడా! వాళ్ళ దాంపత్యం కలకాలం నిలుస్తుందా! లేకపోతే యీ పిల్లని అడ్డం పెట్టుకొని అతను యితర వ్యాపకాలకు లోనవుతాడా! యిదే నా అనుమానం!

ఒకరోజు రామనాధం నా కన్పిస్తే "వెళ్ళాడు కొంత బయటపడ్తోంది అని. "మంచిరోజు చూసి ఆ కాస్త...."

"మనవాడు నా కా బాధ లేకుండా చేసి పోయినవారం వచ్చి పిల్లను తీసుకెళ్ళాడు" అని అన్నాడు. అల్లుణ్ణి తన పార్టీలోకి చేర్చుకొంటున్నట్లుగా.

నా సమస్యకు పరిష్కారం దొరక లేదు.

కూతురు, అల్లుడు కులాసాగా వుంటున్నారని పిల్ల వుత్తరాలు రాస్తున్న దని ఒకసారి కన్పించి చెప్పాడు రామనాధం నాతో.

పిల్ల తండ్రిని మభ్యపెడ్తున్నదేమో నన్న అనుమానం వచ్చింది నాకు.

తర్వాత ఒకసారి రామనాధంతో "పండక్కి రమ్మనమని రాయకపోయి నావా!" అన్నాను.

"రాశాను. తనకు రావటం యిష్టం

లేదట. తను వస్తే మర్నాడే అతను వస్తాడట తనను తీసుకునిపోవటానికి. చూడాలని వుంటే నన్ను రమ్మనమని రాసింది" అన్నాడు.

నా కిది అంతా విచిత్ర అనుభవంగా వుంది యీ విషయం మర్చిపోలేకుండా వున్నాను.

ఒకరోజు— పండగరోజు—రామనాధం కూతురు, అల్లుడు, సినిమాహాలు దగ్గర ఆట అయింతర్వాత నాకు కనిపించారు. ఆ అమ్మాయి చేతిలో చీరెలపాకెట్టూ, అతని చేతిలో పండ్లూ వున్నాయి. నవ్వుతూ గాలిలో తేలిపోతున్నట్లుగా నడుస్తున్నారు. వాళ్ళ వయ్యారం చూసి ఆశ్చర్యంవేసింది నాకు. యిద్దరూ నాకు నమస్కారం చేసారు. నేనే నన్ను కలిసినట్లు అనుకుంటేఎప్పటికే వాళ్ళు వెళ్ళిపోయినారు.

మర్నాడు రామనాధంతో అన్నాను. "మీ కూతురు అల్లుడూ వచ్చారే" అని.

"ఆ వచ్చారు. దానికి నన్ను చూడాలని అన్పించిందట. మధ్యాహ్నం బయల్దేరి రావడం ఒక గంట యినా యింట్లో వుండకుండా సినిమాకు వెళ్ళారు. తెల్లవారు జామున మెయిల్లో తిరిగి వెళ్ళారు. ఆ వచ్చేవాళ్ళు పండగ ముందరొస్తే మా ముద్దుముచ్చట తీర్చుకునేవాళ్ళం గదా! ఏమన్నా వాళ్ళకు కొందామన్నా వ్యవధి యిస్తేగా!" అన్నాడు.

నా అనుమానానికి సొల్యూషను దొరికేటట్లు లేదు. రెండు నెలలదాకా యిది నాలో సమస్యగా వుండిపోయింది. అతని మీద యితర వదంతులుగాని వాళ్ళ అన్యోన్యం విషయమై సందేహంగాని ఎవ్వరూ చెప్పలేదు.

మొదటినుంచి నా తత్వమే అంత! నాకు అనుమానం కల్గినప్పుడుగాని ఒక సమస్య వచ్చినప్పుడుగాని అది తేలేటంత వరకూ నాకు తృప్తి వుండదు.

రామనాధాన్ని మాటల్లో పెట్టి యీ విషయం తేల్చాలనుకున్నాను ఎందుకంటే అతను మర్మం లేకుండా మాట్లాడే రకం.

ఒక రోజు రామనాధంగారింటికి వెళ్ళాను. ఆయన, ఆయన భార్య ఏదో మాట్లాడుకొంటున్నారు.

"పుత్తరాలువ ప్రసన్నయ్యా" అన్నాను.

"అదే అనుకొంటున్నాం ఇద్దరమూ." అతను మా తరవాత పిల్లకి సంబంధం చూస్తాట్ట నన్ను రమ్మనమని రాశాడు. నీవే చూసి బాబూ ఏం రాయాలని అనుకొంటున్నాను అన్నాడు.

"మొత్తంమీద చాలా అదృష్టవంతుడివి బాబూ ఇల్లాంటి అల్లుడు దొరకటం" అన్నాను

"అట్లా ఎందుకనుకోవాలి— అతన్దే అదృష్టం నాలాంటి మామ దొరకటం" అన్నాడు.

"అసలు ఎట్లా సంపాయించావు యీ సంబంధం! ఎంతోమందికి వీలులేనిది ఎంతమందో ప్రయత్నించినా విఫలమయినది నీ కెట్లా సాధ్యమయిందా అని" అన్నాను.

"అక్కడే వుంది- యిందులో వుంది ఒక కిటుకు మాష్టారూ" అన్నాడు తన అప్యాయతనంతా యీ సంబోధనలో వ్యక్తపరుస్తూ.

"ఏవిటి" అన్నాను యింక చెప్తాడనే నమ్మకంతో.

"ఆడపిల్లలు గలవాళ్ళం మనం. మనకు ఎన్ని సమస్యలుంటయ్యో మగ పిల్లవాళ్ళకూ అన్ని సమస్యలుంటాయి. మనకు ఒక సంబంధంకన్నా యింకో సంబంధం బాగుంటుందే అన్న ఆశ వుంటుంది కదా!" అన్నాడు.

"అవునవును" అన్నాను.

"యిప్పుడు యీ అబ్బాయి చూడు సంబంధంలేదు. మ సీనియరు కూతురే నచ్చనివాడికి యింత ఆంధ్రదేశంలో ఎల్లాంటి పిల్లా నచ్చే అవకాశం లేదు. అతని ఆశకు అంతులేకుండా పోయింది. [illegible] ఏటు పిల్లను చూసేటప్పుడు పోస్టుగ్రాడ్యుయేటు పిల్ల కావాలని [illegible] కున్నాడు. ఫిడేల్ వాయించే పిల్లను చూసేటప్పుడు వీణ వాయించే పిల్ల కావాలని అనుకున్నాడు. ఒకసారి వీణ వాయించే పిల్లను చూసి మీకు గ[illegible] వచ్చా అని అడిగాడట. ఎప్పుడయినా రేడియోలో పాడారా అని అడిగాడట.

నిజం చెప్పాలంటే ఆడపిల్లల తల్లి దండ్రులు అతనితో విసిగిపోయినారు. కొన్నాళ్ళనుంచి అతనికి సంబంధాలు రావటం మానివేసినాయి. యింతమంది పిల్లలను చూసి తేల్చుకోలేనివాడు అసలు పెళ్ళిచేసుకుంటాడా అన్న అనుమానంతో నాలుగు నెలలనుంచి సంబంధాలు రావటంలేదు. యిప్పుడు రాముడను అతను ఎంత పెద్ద సంబంధాలు చూశాడో అంత తక్కువవి రావటం మొదలుపెట్టినాయి. పి.యు.సి. ప్యాసుకాని పిల్లలు కట్నాలు యివ్వలేనివాళ్ళు అతని దగ్గరకు వెళ్తున్నారు యీ స్టేజిలో అతనికే అనుమానం వేసింది." చెప్తున్నాడు రామనాథం.

యిదంతా నీకెవరు చెప్పారు" అన్నాను నేను.

"తమ మంచిచెడ్డలు చూసేవాళ్ళు" అన్నాడు. [illegible] ఏదో ఒక సంబంధం చూసుకొని త్వరలో పెళ్ళి చేసుకోవాలని బుద్ధి పుట్టింది. దానితో కోరికలు, [illegible] తగ్గినాయి. యింతెందుకు మా అమ్మాయి సంబంధాని కని వెళ్ళినపుడు అప్పుడే ఎవరో వచ్చి వున్నారు. వాళ్ళే చెప్పారట వాళ్ళ పిల్లను గురించి మెల్లకన్నా, దొడ్డి కాళ్ళానా అని. నేను కనక ఆ క్షణంలో పోకపోయినట్లయితే ఆ మెల్ల కన్ను పిల్లనే సెటిలుచేసుకొనేవారే! సందేహంలేదు. ఎందుకంటే యింకా ఆగితే గ్రేడు తగ్గటమే కాని హెచ్చే పరిస్థితి ఎప్పుడో పోయింది" అన్నాడు రామనాథం.

అబ్బా అనుకుని తలకాయి పట్టుకో లేదు కాని అంతగానూ ఫీలయ్యాను.

——